

# "సమ్మె"

—కాలువ మల్లయ్య

గోదావరి ఖని... ప్రముఖ పారిశ్రామిక పట్టణం... మాంఛెస్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలువబడే ప్రాంతం... వందేళ్ళు తవ్వ డానికి సరిపోయేంత నల్ల బంగారం గనులున్న చోటు... అక్కడి బొగ్గు గనుల్లో ముప్పై వేల మంది కార్మికులు పని చేస్తున్నారు... వాళ్ళంతా గ్రామీణ ప్రాంతాల నుంచి పొట్ట చేత పట్టుకొని వచ్చిన వాళ్ళే... గ్రామాల్లో బ్రతుకు దుర్భరం కాగా బ్రతుకు తెరువును వెతుక్కుంటూ వచ్చిన వాళ్ళు.

ఈ కార్మికులు తవ్వే బొగ్గుతో రైళ్ళు నడుస్తాయి... దేశాన్ని వెలుగులో నింపే విద్యుత్తు ఉత్పత్తవుతుంది... పంట పొలాలను సస్యశ్యామలం చేసే యూరియా ఉత్పత్తవుతుంది... ఈ నల్ల బంగారం మూల ఇంధనంగా మరెన్నో పరిశ్రమలున్నాయి...

అయితే ఆ కార్మికులకు ఇళ్ళు లేవు... చిన్న చిన్న గుడిసెలున్నాయి. ఆ గుడిసెల్లోకి తల వంచుకొనే తప్ప పోవడానికి వీల్లేదు. నిటారుగా నిల్చుండి నడిస్తే తలకు దర్వాజలు తగిలి బొప్పి కడుతుంది... కాళ్ళు ముడుచుకొనే తప్ప పడుకోవడానికి అవకాశం లేదు. ఆ గుడిసెల చుట్టూ మురికి కాలువలు, డ్రైనేజీ నీళ్ళు, రొచ్చుగుంటలుంటాయి. అక్కడ ఈగలూ, దోమలూ, కుక్కలూ పందులూ కాపురముంటాయి. చాలా గుడిసెల్లో కరెంటుండదు... కిరసనాయిలు దీపాలుంటాయి... అక్కడ రోడ్లు లేవు... కానీ, గుంటలున్నాయి.

అక్కడ స్వేచ్ఛగా పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి లేదు... సమీపంలోనే గోదావరి నదున్నా తాగడానికి మంచినీళ్ళు లేవు. తినడానికి పుష్టికరమైన ఆహార పదార్థాలు దుకాణాల్లో వున్నాయి... కానీ, వాటిని కొనడానికి సరిపోయేంత డబ్బు కార్మికుల దగ్గర లేదు. అక్కడి గాలిలో దుమ్ము పొరలో వివిధ పరిశ్రమలు వదిలిన రకరకాల వాయువులుంటాయి. కార్మికులు తాగే నీళ్ళు గనుల్లోంచి వచ్చేవి కాబట్టి అందులో అనేక లవణాలుంటాయి... కార్మికులు కొని తినే చౌక రకం బియ్యంలో రాళ్ళు, మెరిగెలు, ఒలిపిళ్ళుంటాయి...

అక్కడ చలికాలంలో చలుంటుంది... కార్మికుల కాళ్ళు పగిలి దుమ్ముతో తెల్లగుంటాయి... వర్షాకాలంలో బజార్ల నిండా బురుదుంటుంది... ఆ బురదలో అక్కడక్కడ రాళ్ళేసుంటాయి... ఆ రాళ్ళ మీద అడుగులేస్తూ జాగ్రత్తగా నడవాలి... ఎండా కాలంలో తలలు, వీపులు బ్రద్దలయ్యేంత ఎండలుంటాయి... ఈ అన్ని కాలాల్లోనూ ఉదయం, సాయంత్రాల్లో అంటించిన బొగ్గు బక్కెట్లలోంచి వచ్చే బొగ్గుపొగ ఊరంతా మేఘాల్లా ఆవరించుకొనుంటుంది.

అక్కడ ప్రభుత్వ, ప్రైవేటు బళ్ళున్నాయి. ప్రభుత్వ, మేనేజిమెంటు బళ్ళలో కార్మికుల పిల్లలకు అడ్మిషన్లు దొరకడం కష్టం... అన్ని బళ్ళలోనూ చదువు అంతంత మాత్రమే... కార్మికులకున్న వైద్య సదుపాయం నామ మాత్రం...

అందుకే వందలాది ప్రైవేట్ డాక్టర్లున్నారు...

గనుల్లోని పని పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు కార్మికుల ఆరోగ్యాన్ని రోజూ కొంచెం తినేస్తాయి... వాళ్ళ శరీరాల్లో రోగాలుంటాయి... నడుముల్లో నొప్పులుంటాయి...రక్తంలో సారా వుంటుంది. కార్మికులు పదేళ్ల పైగా పని చేస్తున్నా పర్మనెంటు కారు... అక్కడ వడ్డీ వ్యాపారులు దుకాణాలు పెట్టుకొని బాగుపడ్డారు... కాని కార్మికులలాగే వున్నారు. కాదు... ఇంకా దిగజారిపోయారు.

తమ పని పరిస్థితులు మెరుగుపడాలనీ, రోడ్లు బాగు చేయాలనీ, గృహ వసతి అందరికీ కల్పించాలనీ మరికొన్ని డిమాండ్ల సాధన కొరకు నెల రోజుల పైగా కార్మికులు సమ్మె చేస్తున్నారు... జీతం వస్తుంటేనే అంతంత మాత్రంగా గడుస్తున్న కార్మికుల పరిస్థితి సమ్మెతో మరింత దిగజారిపోయింది. వాళ్ళ ఇండ్లలో వస్తువులు నిండుకుంటున్నాయి... చాలా మంది కార్మికుల్లో బ్రతుకు భయం చోటు చేసుకుంది...

అలాంటి కార్మికుల్లో ఓదెలు ఒకడు... పదేళ్ళుగా ఫిల్లర్ పని చేస్తున్నాడు. ఇరవై చదరపు గజాల వైశాల్యమున్న చిన్న గుడిసె... గుడిసె ముందు చిన్న పందిరి... వైరుతో అల్లిన ఫెన్సింగ్ అతనికి వున్న ఆస్తులు... వాకిట్లో వాల్చిన నులక మంచంలో పడుకొని శూన్యంలోకి చూస్తున్నాడు ఓదెలు... సమ్మెప్పుడు ముగు స్తుందో తెలియక అయోమయంగా వుంది... ఆకాశంలోకి చూస్తూ ఏవేవో ఆలోచిస్తూ మౌన వేదన ననుభవిస్తున్నాడు ఓదెలు...

అతని భార్య రాజమ్మ... బొగ్గు పొయ్యం టించి ఇంట్లోకొచ్చింది. ఆమె చేతుల్లో చేట వుంది. ఆ చేటలో డబ్బా దులిపి పోసిన చివరి సోలెడు బియ్యమున్నాయి... ఆమె కడుపులో ఆరని సొద ముఖంలో తీరని వేదన... బియ్యంలో రాళ్ళేరుతోంది రాజమ్మ. ఆమె మనసెక్కడెక్కడో తిరుగుతోంది...

ఈ సమ్మెలు పాడుగాను... ఏ నెలా ఒక్క రోజన్న సమ్మె లేకుండా గడవదు... మొదలే కష్టపుపని... వారం రోజులు నాగవోకుండా పని చేయడం కష్టమే... వాటికి తోడు సమ్మెలు... మరి పని తీసుకునే మేనేజిమెంటు వాళ్ళు చిన్న చిన్న అవసరాలు కూడా ఎందుకు తీర్చరు...? ప్రతి దానికి సమ్మెందుకు చేయవలసొస్తుంది...? ఏమో తన కివన్నీ తెలియవు... కానీ ఇన్ని రోజుల సమ్మె ఈ మధ్య ఎప్పుడూ కాలేదు... ఇంట్లో అన్ని నిండుకుంటున్నాయి... సాయంత్రానికి బియ్యం లేవు... ఈ సమ్మె ఇంకెన్ని రోజులుంటుందో తెలియదు... జీతం లేకుండా ఎలా బ్రతకడం...?

"గా అగ్గి పెట్టె ఇటియ్యే..." అన్న ఓదెలు కేకతో రాజమ్మ ఆలోచనలకు బ్రేకు పడింది.

రాజమ్మకు చిరాకుగా వుంది... ఆందోళనగా వుంది... ఎవ్వరి మీదో తనకే తెలియకుండా కోపంగా వుంది...

"బీడీలు పాడుగాను తాగకుంటేంది...? రోజుకు రెండు రూపాయిలు దండుగ... అవ్వి దాగుతె కడుపునిండుతుందా...? అగ్గి పెట్టె లేదేం లేదు... గాబొగ్గు పొయ్యంటుకుంది... దాంతోని బీడంటు పెట్టుకో..." అని బియ్యం గంపలో పోసి కడగడానికి బావి దగ్గరికెళ్ళింది... ఓదెలు లేచి బీడంటు పెట్టుకొని మంచంలో కూర్చొని పొగ పీలుస్తున్నాడు... రాజమ్మ ఓ సంచి తీసుకొచ్చి ఓదెలు కూర్చున్న మంచంలో

పెరుగుతున్న పాదాలకు అసలైన జోడి.




TS McCann/BIL-TS/191/TL

పని చేసేది, అడుగడుగునా ప్రమాద వీణలు కమాచి పాడే భూమి పొరల్లోకి తొలుచుకు పోయిన బొగ్గుగనుల్లో బతికేది గాలీ వెలుతురు ఆడని కరెంటు కూ్కడా నోచుకోని చీకటి కొట్లలో. ఆ 'శ్రమ'కు నూటికి నూరు శాతం ఖరీదు కట్టే షరాబు లేకపోయినా, ఆ గరీబు బ్రతుకుల్ని కాస్తయినా మార్చే ప్రయత్నం చేయవచ్చు గదా! శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై తెగించి, సమ్మెలు కట్టినప్పుడు 'అమ్మో' ఎంత నష్టం!' అని గుండెలు బాదుకుంటే లాభ. మేమిటి?

పడేసింది... "ఇంట్ల బియ్యం లెవ్వు... ఇంకేం లెవ్వు... పెద్ద దిమసన్నుంటె వాట్నే ఉడుక పెట్టుకొని పోసుక తాగుటానికేం లేకున్నా మిరు ప్పొడో, తొక్కో ఏసుకొని తినచ్చు... బియ్యమన్న తీసుకు రా..." అంది...

తల పైకెత్తి భార్య దిక్కు నిస్పహాయంగా చూసాడు ఓదెలు...

"నా దిక్కు సూత్తేమత్తది...? ఇంట్ల ఏం లేంది నేనెంజెయ్యాలె...?"

"జేబులొక్క పైస గూడ లేదు... పది రూపాయిలుంటె విన్ననే ఐపోయినయి... ఏం జెయ్యన్నో సెప్పు..." అన్నాడుఓదెలు...

"నేనేం జేప్పాలె... అన్నలు డ్యూటీకి పోవ ద్దన్నవోలె ఊకుంటిరి... ఇగేం తింటరో తినుండ్రి..."

"సొన మందికి పనికి పోదామని మా ఉంది... కని, బయానికూకుంటుండ్రు... అయినా మెమ డిగే దాంట్లో తప్పేముందో సెప్పు...? కొంప ల్లేకుంటె కొంపలియ్యమనుదు, రోడ్లు మంచిగ సెయ్యమను దు, తట్టలు మార్చుమనుదు రః ఓమాండ్లు తప్పానె...? ఆల్లెవ్వల కోసురం సమ్మె జేపిత్తుండ్రు... మా కోసరం గాదా..." అన్నాదు ఓదెలు. "మిమ్మల్ని ఉద్దరిచ్చుటానికే సేత్తండ్రు కని ఇంకెన్ని రోజులు...? జీతమిత్తెనే అట్లట్ల గడిసె...మరి జీతం లేకుంటె ఎట్ల బతు కుదు...?" "అటు మేనేజిమెంటోడు గట్టిగనే ఉండె... ఊకె సమ్మె జేత్తుండ్రు అటో తేల్చుకో వన్నని ఆడున్నాడు... ఇటు అన్నలు పట్టు పడు తండ్రు... నడుమ మేం జత్తన్నం..."

"ఏమో వానింట్ల, వీనింట్ల పీనుగు లెల్ల... మేనేజిమెంటోడు గొడ్డు చాకిరయితె సేయించు కుంటడు గని బాయిపనోని సంగజ్జూడడు... అన్న లింట్ల మన్నువడ ... అల్లు సేసేది మన కోసు రమే కని గన్ని ఒక్కపారే గావన్నని పట్టువడి తెట్ల...? అటోల్లు, ఇటేల్లు... ఇద్దరి నడుమ బాయిపనోని సంగతి అడకత్తెర నడుమ పోక తీరుగున్నదీ... ఇంక్లెల్లుడు కష్టమయితంది..." అంది రాజమ్మ...

"మింగుమంటె కప్ప క్కోపమాయె... ఇడువు మంటె పాముక్కోపమాయె... ఊళ్ళెకు పొయ్యి మున్నుకుందామన్నా చారెదు, జాగ లేక పాయె, స్ట్రైకెప్పుడైపోతదో తెలుస్త లేదు... ధైర్యం చేసి పోతె ఆల్లుకూడేటట్టు లేరు..."

"ఏం జేత్తాం...? అందరితోని మనం గని బజారుకు పొయ్యి బియ్యమయితే పట్టుకురా..." అంది రాజమ్మ...

ఎదురు గుడిసెల్లోవుండే మరో కార్మికుడు నర్సయ్య ఓదెలు ఫెన్సింగ్ అవతలున్న జాలరి పై




"నాతోపాటే నడవండి."



పిల్లలు పెరుగుతున్నారంటే వారితో పాటు పెరుగుతవి వారి పరుగులాటలు. అటువంటి సమయంలో పిల్లలకు కావాలి మన్నికైన, సుఖవంతమైన పాదరక్షలు, పాదాలకు ఆరోగ్య కరమైన పెరుగుదలనిచ్చే పాదరక్షలు. అవే ! బాటావారి టిగ్రె స్కూల్ షూస్. దేశంలో ప్రతి చెప్పుల దుకాణంలో లభిస్తుంది.

TIGRE
A BATA PRODUCT
SCHOOL SHOES

మండి దుమికి లోపలికొచ్చాదు... ఓదెలు ప్రక్కన మంచంలో కూర్చుంటూ అన్నాడు...

"ఏ సంగతి? చెల్లే, నువ్వు వాదంల పడ్డ టు న్నరు.శ్రీ." "ఇంట్ల సామాన్లు లెవ్వు... జేబుల పైసల్లెవ్వు... ఆ కోప మీ కోపం అందర్ని కలిపి తిడుతంది మీ చెల్లె... ఉద్దరిత్తడో ఇయ్యడో వైకుంఠం షావుకారి... మిత్తికి పైసల్దెత్తామంటె నూటికి నెలకారు రూపాయిలకంటె తక్కే లేపాయె..." అన్నాడు ఓదెలు.

" చెల్లే కొంచె మోపిక పట్టుకోవాలె... పదేండ్లు దాటినా పర్మినెంటు జెయ్యక పెయిరి... క్వార్టర్లియ్యక పెయిరి... రోడ్ల సంగతి గట్లుండె... తట్టల సంగతి గట్లుండె... గిపోంటియి అడుగుడు తప్పా సెప్పుళ్ళీ సమ్మెతోని కొందరి పొయ్యిలల్ల పిల్లులు లేత్త లెవ్వు... గీ పన్జేసుకుంట పైస లెను కేసుకున్నోల్లు సాన తక్కువ మందున్నరు... అయినా గని ఏదన్న సాధించాలంటె కొంత నష్టపోవాలె..." అన్నాడు నర్సయ్య... "ఏమోనె నర్సన్న... నాకయితేం మనుసున వడు త లేదు..." అని గుడిసె లోపలి కెళ్ళింది రాజమ్మ...

ఇంతలో మరో కార్మికుడు రాజలింగు వచ్చి అదే మంచంలో కూర్చున్నాడు... ఓదెలు లేచి అక్కన్నే వున్న మరో మంచం వాల్చి అందులో కూర్చున్నాడు...

"జీతమత్తలేదు... ఎట్ల బతుకుడని మనం అరగోస పడుతంటె గిరాకు ల్లెవ్వని దుకాణ పోల్లు మొత్తుకుంటుండ్రు... మొత్తం అమ్మకాలు పడి పోయినయట... ఇంక రొన్నెల్లు గిట్లనే వుంటె దుకాండ్లు మూసుకొని పోవుడే అంటు న్రదు..." అన్నాడు నర్సయ్య...

"డాక్టర్లు గూడ గిరాకి లేదని ఏదుత్తుండ్రు... బ్రాంది షాపులోల్లు సారా దుకాణపోల్లు ఏడ్సయితే ఏడ్సు గాదు..." ఓదెలు... "ఆం... ఆల్లకు తక్వ అయింది తియ్యి... ఇన్ని రోజులు వెయ్యికు వెయ్యిలు సంపాయించలే... పెద్దోడు పెండ్లి కేడిత్తే చిన్నోడు కాళ్ల గోళ్ళ కేడ్సవట్టుండ్రు దాల్ల సంగతి... పొట్ట లెట్లగడుత్తాయని మనమే దుత్తంటె లాభాలెట్లని ఆల్లేదుత్తుండ్రు...మన దగ్గర్నే పైసల్లేకుంటె ఏం జేసుడు సెప్ప...? ఏం గొంటం... ఎట్ల గొంటం..." అన్నాడు రాజలింగు...

"అందరా రాముగ కూసున్నట్టురు గద... ఇగ మన కారామేపట్టు..." అనుకుంటూ వచ్చి ఓదెలు ప్రక్కనే మంచంలో కూర్చున్నాడు రామచంద్రం... "బాయిల్నడిత్తెమనం గిట్ల తిమ్మితంగ కూసుండి మాట్లాడుకుందుమా? ఒగతిదో మాటాయె... ఇంకొగలదో మాటాయె... పొయ్యి పొయ్యచ్చెవారకుపానం గువ్వల కచ్చె...తిని పండు డేనాయె... ఓ స్ట్రయికు జెయ్యవట్టి పుర్సత్ దొరికింది..." అన్నాడు రాజలింగు నవ్వుతూ... కానీ ఆ నవ్వు మామూలునవ్వులా లేదు ఏడ్వలేక నవ్వినట్టుగా వుంది... పుట్టెడు దాకల్ని, అగ్ని పర్వతాల్ని కదుపులో దాచుకొని నవ్వే, నవ్వించే చార్లీ చాప్లిన్ సినిమాల్లోని నవ్వులా వుంది... వాళ్ళందరి ముఖాల్లోనూ అదే భావ ముంది...



"హోటళ్లకి క్లబ్బులకి వెళ్లినప్పుడు ఎంతు ఖర్చయితే అంత బిల్లు చెల్లించమని నా ప్రేయసీ డబ్బు నా చేతికిస్తుంది"

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా...!"

"ఇంటి దగ్గర్నుండి డబ్బులు రాగానే వడ్డీతోసహా మొత్తం కట్టేస్తాను. తాకట్టు పెట్టిన వస్తువుల్ని జాగ్రత్తగా తిరిగి ఇస్తుందామె"

—చందు

కళ్ళు నులుముకుంటూ రాజమ్మ బయట కొచ్చింది.

"ఏయ్... ఒక్క నాలుగు చాయల్జెయ్యి..." అన్నాడు ఓదెలు ఆమెతో.

"లుక్సాన్ల బాగోతమని గిప్పుడు చాయలెందుకు తియ్యి... ఇంట్లేమున్నయో లెవ్వో... వద్దు చెల్లె ఊకుండు..." అన్నాడు నర్సయ్య.

రాజమ్మేం మాట్లాడకుండా లోపలికెళ్ళింది.

"రామచంద్రం... మొన్న పండుగకు ఊరికి పోతివిగద ఊళ్ళె అంత మంచిదేనా?" అన్నాడు ఓదెలు... వాళ్ళిద్దరిదీ ఒకే ఊరు.

"ఏం మంచిదే ఓదన్న జేబులు గరంగుంటె అంత మంచిగనే వుంటది. జీతం రాపాయె. ఆడిచ్చిన వెయ్యి రూపాయలద్వాన్సు కొసర్లకే ఐపాయె... బట్టల దుకాండ్ల ఖాతపెట్టి బట్టలు మా కొనుక్కపెయున గని ఈసారి పండుగ పండుగ తీరుగనే అనిపించలే... అంతా బయం... భయం... స్ట్రయకెప్పుడయిపోతదో, బాయిలెప్పుడు నదుత్తయో అన్న ఆలోసనే" అన్నాడు రామచంద్రం.

"ఇక్కన్నయితె ఇంకా గోరం... బాయిపనోని ఎవ్వల మొకంల రకతం లేదు... పండుగ పండుగోల్నే అనిపియ్యలే..." ఓదెలు

"సాన మంది ఊళ్ళళ్ళ కెల్లిపెయిండ్రు బాయిలు తెర్సిండ్రని తెలుత్తెనే నత్తరిగ" అన్నాడు రాజలింగు...

"ఊల్లె ఎల్లుమానుగాకనే పొట్టలు సేతవట్టుకోని గిక్కడి కత్తిమి... మనసొంటోల్లం ఊళ్ళెకు పొయ్యేంజేసుడు కొద్దో గొప్పో బూమున్నోల్లు దున్నుకోవచ్చుగని మనకేముంది?" అన్నాడు నర్సయ్య.

"ఆం ఇగ గిప్పుడు దుంతరు తియ్యి... బాయి పనుల కచ్చినోల్ల ఎవుసాయాలన్ని మూలకు పడె ఎడ్లు కొని, ఎవుసం బెట్టె దుంతరా ఇగ...?" అన్నాడు ఓదెలు.

"అవు అది గూడ నిజమే. కని ఊళ్ళె ఇంత బూముంటె కిందికో, మీదికో మా బొర్లుతరు. ఏం లేనోని కచ్చింది తిప్పల... ఇగ ఈ స్ట్రయక యిపోయెటట్టు లేదని కొందరు కూరగాయ లమ్ముతండ్రు, కొందరేమొ ఏం జెయ్యాన్నో తెలువక అటీటు తిరుగుతండ్రు. కొందరేమొ పేకాడుకుంట పొద్దు గడుపుతుండ్రు..." అన్నాడు రాజలింగు.

"నెల దాటె నందుకే మనం గింత పరేషానయితన్నం. మరి గా అంతర్గామోల్ల సంగతేంది? కాగజ్‌నగర్ కార్మికుల సంగతేంది? కొన్నేండ్లాయె జీతాలు లేక" అన్నాడు రామచంద్రం.

" గాల్ల సంగతి వింటె కండ్లు పొంటె నీల్లు గారుతయి. నలుగురైదుగురు ఆకలికి సచ్చిపెయిండ్రటు. కొందరదుక్క తింటండ్రట. కొంద రాడోల్లు యభిచారం సేసుకుంట బతుకుతండ్రట" అన్నాడు ఓదెలు.

వాళ్ళందరి ముఖాల్లోనూ విచారం... భయం... ఆందోళన.

చిన్న స్టీలు గ్లాసుల్లో టీ తీసుకొచ్చి నలుగురికిచ్చింది రాజమ్మ.

"వద్దన్నా చా జేసినావె చెల్లె? ఎందుకు పుల్లెందల వడ్డవే? మేమేమన్న కొత్త సుట్టాలమా?" అన్నాడు నర్సయ్య.

"గీ చాయిచ్చుడు కష్టమానె! మీ బావేమన్న కల్లు పోసిచ్చిండా?" అంటూ లోపలికెళ్ళింది రాజమ్మ.

"మరీ సమ్మె ఎప్పుడయిపోతదంటవే? దీపావళి బోనసన్న ఇత్తరా? ఇయ్యరా" అన్నాడు రాజలింగు నర్సయ్యతో.

"బోనసియ్యరట. తెల్సింది లాకౌట్ జేత్తరని పేపర్లచ్చింది. లాకౌట్ జేత్తిగ కష్టమే" అన్నాడు నర్సయ్య.


24-5-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

"ఈ స్ట్రయికుతో వందరికి నష్టమే అయితంది. అన్ని దుకాండ్లల్ల ఎన్టిపీసోల్లు, ఎరువుల ఫ్యాక్టరోల్లు తప్ప కనవడుతలేరు. లాకౌట్ జేస్తె కష్టమే" అన్నాడు రామచంద్రం... ఖాళీగ్లాసు క్రిందబెట్టాడు.

"వడ్డీలకిచ్చెటోల్లు, ఫైనాన్సులు నడిపెటోల్లు సంబరపడుతండ్రు. అడ్డగోలు మిత్తీల కిత్తండ్రు" అన్నాడు రాజలింగు.

"ఇల్లుగాలి ఒగడేదుస్తంటె చలిగాసుకున్నడట ఇంకొగడు. పీనుగుల మీది బట్టలొలుసుకునే రకముంటరు కొందరు. తీరు తీర్ల మనుషులుంటరు. ఇదిట్లనే వుంటె పండ్లుగొని ఎన్టిపీసి, ఎఫ్.సి.ఐ.ల తిరిగి అమ్మాలెనముకుంటన్న" అన్నాడు రామచంద్రం.

"దండంత దాసర్లయితె బిచ్చం బెట్టెటోల్లెవ్వలు? అక్కడ తక్కోమందున్నరని నీ దగ్గర గొంటరా?" అన్నాడు ఓదెలు.

"సమ్మెలు జెయ్యనోల్లెవ్వలు సెప్పండ్రి? సింగరేణిల కొంచెమెక్కోకని సమ్మెలంత టున్నయి... గప్పట్ల పోలీసోల్లు గూడ జేసిరి... ఆఫీసర్లు గూడ జేత్తండ్రు. మనం జేత్తెనేమొ తప్పాయె. ఏదేమైనా భయపడద్దు అయ్యేటిదయితది" అంటూ లేచాడు నర్సయ్య.

అతన్తోపాటు మిగతావాళ్ళు కూడా లేచి నిల్చున్నారు. పొయ్యొస్తామని చెప్పి నర్సయ్య, రాజలింగు, రామచంద్రం వెళ్ళిపోయారు.

ఓదెలు సంచి చేతిలోకి తీసుకొని

"నేను బజారుకు పోతన్ననే..." అని భార్యను కేకేసి బయటకెళ్ళాడు. ఎవరి దగ్గరికి అప్పుకెళ్ళాలా అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు 'అతని మనసంతా గజిబిజిగా వుంది. ఆందోళనగా వుంది. భయం భయంగా వుంది.

ఎప్పుడూ బజార్లనిండా కనబడే జనం పలుచగా వున్నారు. బూట్లు తొడుక్కోని, తలమీద బొక్క టోపీలు పెట్టుకొని నిక్కర్లతో నడుచుకుంటూనో, డొక్కు సైకిళ్ళ మీదో పోయే గని కార్మికులు రోడ్ల మీద కనబడటంలేదు. గుడిసె హోటల్లలోకి చూసాడు ఓదెలు. బెంచీల మీద కూచొని టీలు తాగుతూ బాతఖానీ చేసే వాళ్ళాతనికి కనపడటంలేదు. తొవ్వంబడున్న సారా దుకాణం దిక్కు చూసాడు. ఎప్పుడూ జనంతో నిండివుండే సారాకొట్టు పలుచ పలుచగా కనబడింది ఓదెలుకు. డాక్టర్ల క్లినిక్కులలోకీ చూసాడు. కొంతమంది డాక్టర్లు పేషెంట్లు లేక ఈగలు తోలుతున్నారు. కొందరి దగ్గర ఒకరిద్దరుండటం గమనించాడు. దీపావళి పండుగ ముందర బట్టల కొట్లలో ఎంతో మంది జనముండేవారు. బట్టలకొట్లలో బావి కార్మికులెవరూ కనపళ్ళేదతనికి. అలాగే కూరగాయల మార్కెట్లోనూ, కిరాణ కొట్లలోనూ జనం లేకపోవడం చూసాడు ఓదెలు.

'ఎప్పుడు జనం తోని కళకళలాడేది పట్నం. శ్మశానం లెక్కయింది. పైసల్లేంది ఏంగొంటరు? ఎట్ల గొంటరు? ఎంత తకిలీఫచ్చింది బాయిపనోల్లకు?' తనలో తానే గొణుక్కున్నాడు.

పోలీసు జీపు తిరగడంచూసాడు ఓదెలు.

'అన్నిటి కీల్లయితె రడి... మా పానాలు తీసటానికి' అనుకున్నాడు. వైకుంఠం షావుకారి దగ్గరికెళ్ళాడు. ఓదెల్ను చూసి ఇదువరకివ్వాల్సిన డబ్బులడిగాడు షావుకారి.

"అవ్వీ ఇవ్వీ కలిపిస్తగని పది కిలోల బియ్యమియ్యండ్రి" అన్నాడు.

"ఎట్లిత్తవు సెప్పు. రేపో, ఎల్లుండో మూడు నెల్లదాక లాకౌట్ ప్రకటిస్తరట. తిన్నదరుగక స్ట్రయికు జేత్తండ్రు" అన్నాడు వైకుంఠం.

లాకౌట్ అనేసరికి తలపై పిడుగుపడ్డట్టయింది ఓదెలుకు. ఎంత బ్రతిమిలాడినా బియ్యమియ్య లేదు షావుకారి... ఇక లాభం లేదని వడ్డీ వ్యాపారి వెంకటేశం దగ్గరికెళ్ళాడు.

"ఒక్క రెండు వందల రూపాయలు సదురుండ్రి సేటు" అన్నాడు దీనంగా.

బుర్ర గోక్కున్నాడు వెంకటేశం.

"నువ్వు మంచోనివే ఓదెలు. కాదంటలేను. నిజాయితీపరునివే... కని, కాలం మంచిగ లేదు. అటుజూత్తె లాకౌటంటండ్రు. లాకౌటయినంక నీకు జీతమెట్లత్తది? జీతం లేకుంటె నా బాకెట్ల గడుతవు? గందుకోసం ఏదన్న మాలు దీసు కచ్చి కుదువపెట్టి పైసల్దీసుకపో. ఇమ్మానేంది మాలువెడితె నమ్మానయున ఇత్త" అన్నాడు.

తన అవసరాన్ని గూర్చి ఏదో చెప్పబోయాడు ఓదెలు. కాని వెంకటేశం వినదలుచుకోలేదు.

"గవ్వన్నేం జెప్పకు నాకు మాల్దీసుకరా... పైసల్దీసకపో... కాలం మునుపటి తీరుగ లేదు. ఏమనుకోకు ఓదెలు. నిన్ను నమ్మత లేనను కునేవు. కని, నా జాగ్రత్తల నేనుండాలె గద" అని లేచి లోపలికెళ్ళాడు.

కాళ్ళీడ్చుకుంటూ ఇంటిదారి పట్టాడు ఓదెలు.

బజార్లో కుక్కలు దీనంగా విలపిస్తున్నాయి. నీళ్ళ పంపు దగ్గర ఆడవాళ్ళు బిందెలు నెట్టుకుంటున్నారు. వాకిట్లో నిల్చొని బదిలీ ఫిల్లర్ భార్య లింగమ్మ అన్ని పార్టీల యూనియన్ వాళ్ళనూ, అన్నలనూ, మేనేజిమెంటువాళ్ళనూ పేరు పేరున బూతులు తిడ్తోంది. బిస్కట్లు కావాలని అడిగిన పసివాన్ని ఓ కార్మికుడి భార్య వీపు బద్దలు చేసింది. అడ్డమొచ్చిన భర్తను సంపాదించడం చేతగాదని తిట్టింది కూడా. అనేక దృశ్యాలను చూస్తూ ఇంటిదిక్కు నడుస్తున్నాడు ఓదెలు.

'అందరు సమ్మెలు జేత్తరు... కాని మా అసోంటి నల్లబట్టలోల్లు జేత్తె తప్పు. లాకౌట్ జేత్తరట... లాకౌట్...' తనలో తానే అనుకున్నాడు.

'లాకౌట్ ప్రకటిస్తే తమ బ్రతుకులు కూడా అంతర్గాం, కాగజ్‌నగర్ కార్మికుల బ్రతుకుల్లా...?' ఇక ఆలోచించలేకపోయాడు ఓదెలు.

సమ్మె చేయడం తప్పుగాదు. కార్మికుల డిమాండ్లు న్యాయసమ్మతమైనవే. కాని చాలా మంది కార్మికులకు సమ్మె విరమించి పనిలో కెళ్దామనే వుంది. లోపమెక్కడుంది?

ఓదెలు ఆలోచన కందడంలేదు.

ఓదెలు కడుపునిండా దుఃఖముంది. కనుగుడ్లనిండా నీళ్ళున్నాయి. భవిష్యత్తులో ఏం కానుందో అన్న భయముంది.

ప్రస్తుతం గండం గడవడానికి కావాల్సిన డబ్బుకోసం భార్యమీద మిగిలిన ఒకే ఒక నగ- పెళ్ళిలో ఆమె తల్లిగారు చేయించిన బంగారు కడియమిమ్మని ఎలా అడగాలో, ఆ నగను కుదువబెట్టి ఆమెకు ముఖమెలా చూపించాలో అర్థంగాక చెమటలు పట్టిన ముఖంతో ఇల్లు చేరుకున్నాడు ఓదెలు. భర్త ముఖం చూస్తూ, అతని చూపును చూస్తూ పరిస్థితి నర్థం చేసుకున్న రాజమ్మ తన కుడి చేతికున్న కడియం తీసి అతని చేతిలో పెట్టింది.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్